క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్



కొణిజెర్ల(గంపలగూడెం): కుల,మత, ప్రాంత, రాజకీయాలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు బొల్లా కరుణాకర్‌రావు(బుజ్జి) అన్నారు. గ్రామ పరిధిలో ఈ నెల నూతనంగా 34 మందికి పింఛన్ మంజూరు కాగా సర్పంచ్ ఇలవరపు నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు కటుకూరి రాధమ్మతో కలసి ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి శుక్రవారం నగదు పంపిణీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ తిరుపతిరావు, డిజిటల్ అసిస్టెంట్ ఎం.కిషోర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్

నూజివీడు: పట్టణ పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయిన వారు విద్యుత్ కనెక్షన్ కోసం స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఏ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం ఇళ్ల స్థలం పట్టా, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వినాయక్‌నగర్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.శనివారం అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను వినాయకనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి పర్యవేక్షించారు. దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో రోడ్డులో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగాయి. చిన్నారులు భక్తి గీతాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కళాకారులను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతి సంస్థలు కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మీనాక్షి కల్చరల్ ఆర్ట్స్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, సినీ సంగీత విభావరి, విద్యావేత్త మధుమోహన్‌కు అభినందన సభ నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులు సేవలు జాతికి అవసరమని తెలిపారు. అక్కినేని సినీ జీవిత విశేషాలను వివరించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని హనుమంత గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. విద్యావేత్త మధు మోహన కృష్ణ గురించి మాట్లాడుతూ అధ్యాపకునిగా ఆయన వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. మీనాక్షి కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకుడు మధుమోహన్ మాట్లాడుతూ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు, ఆదిరాల జయప్రభు ప్రసూనా రామన్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గోశాలకు రూ.1.12 లక్షల విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గోశాల నిర్వహణ, అభివృద్ధికి శుక్రవారం దాత పి.కామేశ్వర శర్మ దంపతులు రూ.1.12 లక్షలు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. దాతలు మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న గోశాల నిర్వహణ, అభివృద్ధికి తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామని చెప్పారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ సకల దేవతల స్వరూపమైన గోవుల పరిరక్షణకు తాము గోశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం దాతలకు పూజలు చేయించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్య శ్రీహరి, యాదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన మర్లపాలెం విద్యార్థులు

చాట్రాయి: నూజివీడు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన స్కూలు గేమ్స్ పోటీల్లో మండలంలోని మర్లపాలెం, చిత్తపూరు హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 14,15 తేదీల్లో ముసునూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన పోటీల్లో చిత్తపూరు, మర్లపాలెం హైస్కూలు విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంలు బక్కయ్య, దామోదరరెడ్డి, పీఈటీలు ప్రభాకర్, డి.సతీష్ తదితరులు శుక్రవారం అభినందించారు.

నూజివీడులో..

నూజివీడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో పట్టణంలోని కుమార్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పిన్నమనేని వెంకటకుమార్ శుక్రవారం తెలిపారు. బాస్కెట్‌బాల్ పోటీలకు నలుగురు, వాలీబాల్‌కు ఒకరు ఎంపికయ్యారని పేర్కొన్నారు. బాస్కెట్‌బాల్‌లో అండర్–14లో బీ కుసుమ, అండర్–17 విభాగంలో బీ భవ్యశ్రీ, బీ చామన, ఆర్ మంజునాథ్, వాలీబాల్‌లో అండర్–14 విభాగంలో జీ కౌశిక్ శ్రీనివాస్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ పిన్నమనేని సంధ్యాలక్ష్మి అభినందించారు.



ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన నూజివీడు విద్యార్థులు

తిరువూరులో..

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గంపలగూడెంలో నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక శ్రీనిధి స్కూలు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. అండర్–14 విభాగంలో కబడ్డీ బాలురులో వినోద్, బాలికల్లో రమ్యశ్రీ, ఖోఖోలో పల్లవి, ఉపేంద్ర, అండర్–17 విభాగం కబడ్డీలో జోష్, పార్థు, రిషిత, ఖోఖోలో తేజస్విని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



జిల్లా పోటీలకు ఎంపికైన తిరువూరు శ్రీనిధి స్కూలు విద్యార్థులు

ప్రజలందరికీ సకల శుభాలు కలగాలి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ (కొత్తమద్దులపర్వ), మిట్టగూడెం సెంటర్‌లో వినాయక చవితి వేడుకల్లో పాల్గొని పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాజెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులను విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. అనంతరం యాదవబజారులో యాదవ సంఘం ఆధ్వర్యంలో, మిట్టగూడెం సెంటర్‌లో నిర్వహించిన అన్నదానం కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాలంకి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కోమటికృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొలుసు గంగాధర్ పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

నూజివీడు (ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలంలోని కృష్ణవరంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు ఈ నెల 23న ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పాడి రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

అర్లపాడు(గంపలగూడెం): పాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువులను పోషణ చేసే రైతులకు అవసరమయ్యే చేయూతను అందజేస్తుందని మండల పశువైద్యాధికారి అభిలాష్ తెలిపారు. జగనన్న పాల వెల్లువలో భాగంగా గంపలగూడెం మండలం అర్లపాడు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రుణమేళాలో ఆయన మాట్లాడారు. గేదెల కొనుగోలుకు గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు ద్వారా ఒక రైతు రూ.లక్ష రుణ సౌకర్యం అందజేస్తామన్నారు. గేదెల పోషణ కోసం మరో రూ.30వేల రుణం అందజేస్తామని తెలిపారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, పశువైద్యులు సాయికృష్ణ, గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్లు మల్లాది ఏసోబు, కొండయ్య, సర్పంచ్ కూరాకుల త్రివేణి, ఎంపీటీసీ సభ్యులు గడ్డం మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్లకు రూ.37 లక్షల మంజూరు

తిరువూరు: విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి తిరువూరు నియోజకవర్గానికి తాగునీటి ట్యాంకర్ల కొనుగోలు నిమిత్తం రూ.37 లక్షలు మంజూరైనట్లు గ్రామీణ నీటిసరఫరా విభాగ అధికారులు తెలిపారు. తిరువూరు నగర పంచాయతీలో ఎనిమిది ట్యాంకర్లకు రూ.32లక్షలు, విస్సన్నపేట మండలం మారేమండ, గంపలగూడెం మండలం సొబ్బాల పంచాయతీలకు రూ.5 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



హైస్కూల్ ప్లస్ ఆవరణను శుభ్రపరుస్తున్న క్యాడెట్లు

నూజివీడు: వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల దాడి నుంచి రక్షణ పొందవచ్చని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం వీవీఎస్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో శుక్రవారం నేషనల్ గ్రీన్ కాప్స్ ఈకో క్లబ్ క్యాడెట్స్ పాఠశాల ఆవరణను శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కాకిలేటి శ్యామ్‌బాబు, పీడీ రాణి, గ్రీన్ టీచర్ నాగబాబు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

గానుగపాడు(తిరువూరు): విద్యార్థులు పాఠశాల దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎండీపీ జిల్లా రిసోర్సు పర్సన్ రాంప్రదీప్ సూచించారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో నాయకత్వ లక్షణాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఉద్యోగం చేయడం కాక ఒకరు పదిమందికి ఉపాధి కల్పించే విధంగా కృషి చేయాలన్నారు.

మూఢాచారాల నిర్మూలనకు గురజాడ కృషి



మునుకుళ్లలో గురజాడ చిత్రపటం వద్ద నివాళి

మునుకుళ్ల(తిరువూరు): సమాజంలో నెలకొన్న మూఢాచారాలను పోగొట్టేందుకు మహాకవి గురజాడ అప్పారావు విశేష కృషిచేశారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. మండలంలోని మునుకుళ్లలో జేవీవీ ఆధ్వర్యంలో గురజాడ జయంతిని శుక్రవారం నిర్వహించారు. తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన గురజాడ చిరస్మరణీయుడన్నారు. గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులు సుందర్శన్, రాంప్రదీప్, నాగేశ్వరరావు, రమాదేవి, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పథకాల గురించి ప్రజలకు వివరించాలి

మైలవరం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ రెండు పథకాల మధ్య ఉన్న వ్యత్యాసం తెలియక ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆయుష్మాన్ భవ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రేగళ్ల

తిరువూరు: తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రతి శుక్రవారం ఆయుష్మాన్ భవ కార్యక్రమం కింద ప్రత్యేక వైద్యసేవలందిస్తామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహనరెడ్డి తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సేవల్లో భాగంగా ఈఎన్‌టీ, చిన్నపిల్లల వైద్యనిపుణులు, స్త్రీ వ్యాధి నిపుణులు రోగులకు వైద్యసేవలందిస్తారని, రోగుల పేర్లు ఇతర వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేసి రాష్ట్రంలోని ఏ ఆస్పత్రిలోనైనా ఉచిత సేవలు పొందే అవకాశం కల్పిస్తారన్నారు. జ్వరపీడితులకు వైద్యపరీక్షల నిమిత్తం సీబీపీ యంత్రపరికరం ఏర్పాటు చేయాలని, స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. వైద్యాధికారులు గార్గేయ, భానుతేజ, సౌమ్య పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం, నీటి పన్ను, డ్రెయినేజి పన్ను, వాటర్ మీటర్ పన్నులను చెల్లించేందుకు వీఎంసీ ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేసిందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం తెలిపారు. ఆయా క్యాష్ కౌంటర్లు శెలవు దినాల్లోనూ పనిచేస్తాయని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక




ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక విజయవాడలో శుక్రవారం జరిగింది. నగరంలో ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.వీరారెడ్డి, సీనియర్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా బి.సురేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ యదిద్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.సాంబశివరావు, డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.రవికుమార్, జాయింట్ సెక్రటరీ సుబ్బారావు, శిరీష, ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్.వెంకట్, ఎ.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, రాయలసీమ ఇన్‌చార్జిగా ఈ బాలగౌడ్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులను చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అభినందించారు. అలాగే వచ్చే ఆరు నెలలో రాష్ట్రంలో 24 ట్రైనింగ్ క్యాంప్స్, 3 అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులు, 3 రాష్ట్ర స్థాయి బిజినెస్ ఎగ్జిబిషన్స్, 3 ఇండస్ట్రియల్ టూర్స్, 3 ఇంక్యూబేషన్ సెంటర్స్‌లను ఐబీటీ కాన్పూర్ సహకారంతో చేయటానికి కార్యాచరణ రూపొందించారు. నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ 26 జిల్లాలలో పారిశ్రామిక అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ కమిటీ వివరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత అధికార విభాగాలకు పంపిస్తామని తెలిపారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లపై అధికారులు శుక్రవారం పరిశీలించారు.

హాస్టల్స్‌లో విద్యా ప్రమాణాలు పెంచాలి



సమావేశంలో పాల్గొన్న వసతి గృహాల సంక్షేమ అధికారులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎం. విజయభారతి అన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో సంక్షేమ వసతి గృహాల సహాయ సంక్షేమ అధికారులు, సంక్షేమ అధికారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. 100 శాతం బయోమెట్రిక్ హాజరు తప్పక ఉండాలని తెలిపారు. కచ్చితంగా మెనూ అమలు చేయాలని సూచించారు. వసతిగృహాల సిబ్బంది వారికి కేటాయించిన సమయాలలో తప్పక హాజరు కావాలని, హెడ్ క్వార్టర్‌లో నివాసం ఉండాలని ఆదేశించారు. అన్ని రికార్డులు తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. పది, ఇంటర్ విద్యార్థుల చదువు, ఉత్తీర్ణత విషయములో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హాస్టల్స్‌లో కిచెన్ గార్డెన్ ను తప్పకుండా ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

రసరమ్య కావ్యం రామాయణం

విజయవాడ కల్చరల్: రసరమ్య కావ్యం రామాయణమని ప్రఖ్యాత హరికథా భాగవతార్ బుర్రా పద్మనాభశర్మ అన్నారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణ పురంలోని సీతారామా కల్యాణ మండపంలో శుక్రవారం సుందరాకాండ అంశంగా కథా గానం చేశారు. వాల్మీకి రామాయణం నిత్యనూతనమన్నారు. మూర్తీభవించిన ధర్మానికి ప్రతి రూపం రామచంద్రుడుని తెలిపారు. సీతాన్వేషణ సమయంలో హనుమంతుని కార్యదక్షత, ధర్మనిష్ఠ అంశాలు మనకు కనిపిస్తాయని చెప్పారు. రామాయణలోని సుందరాకాండ పఠనం వల్ల సర్వశుభాలు కలుగుతాయన్నారు. సుధాకర్, దక్షిణా మూర్తి వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఊటుకూరి పార్థసారథి, కార్యదర్శి దశరథ రమేష్, కోశాధికారి అనుముల సోమశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు



తిరువూరు షిర్డీసాయి మందిరంలో గణపతికి పూజలు



చెక్కపల్లి బాబా మందిరంలో సామూహిక కుంకుమార్చన



మైలవరం ప్రధాన వీధుల్లో ట్రాక్టర్‌పై గణనాథుడి ఊరేగింపు

తిరువూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరువూరు పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులకు శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. శ్రీషిర్డిసాయి మందిరం, బైపాస్‌రోడ్ లక్ష్మీ గణపతి ఆలయాలలో అష్టోత్తర శతనామాలతో విశేషపూజలు చేశారు. విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. శ్రీకోదండ రామాలయంలో సంపూర్ణ రామాయణ ప్రవచనం జరిగింది. ఈ నెల 24న షిర్డీసాయి మందిరంలో గణపతి కల్యాణం నిర్వహించనున్నట్లు మందిర కమిటీ తెలిపింది.

చెక్కపల్లిలో సామూహిక కుంకుమార్చనలు

ముసునూరు: భక్తుల గణనాథుడి నామ స్మరణలు, పురోహితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో చెక్కపల్లి గ్రామం పులకించింది. భక్తిశ్రద్ధలతో స్థానిక సాయిబాబా మందిరం వద్ద సాయి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు శుక్రవారం ఘనంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమ కన్వీనర్లు తుమ్మల సురేంద్ర, చిలుకూరి లక్ష్మి, సమరసత ఫౌండేషన్ ప్రచారక్ పరమేశ్వరరావు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా నిమజ్జనం

మైలవరం: మైలవరంలో ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథుడికి శుక్రవారం భక్తులు వీడ్కోలు పలికారు. మైలవరం చిన్న చెరువు వాసులు వినాయకుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై పూలతో అలంకరించిన వేదికపై ఆశీనుడి చేసి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం జి. కొండూరు మండలం కుంటముక్కల చెరువులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మండలంలోని చిలుకూరివారిగూడెం గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొలుత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గణపతిని ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

జేజేఎం స్కీంలో బోర్ల తవ్వకం



గంపలగూడెం మండలం ఊటుకూరులో బోరు తవ్వకం

గంపలగూడెం: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కోసం జలజవన్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని ఐదు గ్రామాల్లోని బోర్ల తవ్వకం చేపట్టారు. పెనుగొలను, దుందిరాలపాడు, నెమలి, కొణిజెర్ల, ఊటుకూరు గ్రామాలకు తొమ్మిది బోర్లు మంజూరయ్యాయి. వీటిలో ఎనిమిది బోర్ల తవ్వకం పూర్తి కాగా వాటిలో ఐదు బోర్లలో జలం సంవృద్ధిగా పడగా, మిగిలిన మూడు బోర్లు విఫలం అయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్వామినాయక్ తెలిపారు. జలం సక్రమంగా సరఫరా అవుతున్న ఐదు బోర్లకు మోటార్లను బిగించి పైపులైన్‌కు కలపడం ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నబ్బాయి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన ఎంపీపీ జోత్స్న

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): స్థానిక ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌బాషా బంధువు విశ్రాంత ఎలక్ట్రికల్ ఇంజినీర్ మహమ్మద్ ఖలీలుర్ రెహ్మాన్ గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మొగులూరు ఏలీషా సహకారంతో బ్యాగులు, స్నాక్స్ బాక్స్‌లు, స్టీల్ వాటర్ బాటిల్స్, రాత పుస్తకాలు, పెన్సిల్ కిట్లు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంఈఓ సీహెచ్ పుష్పలత పాల్గొని విద్యార్థులకు అందజేశారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమెరికా దేశస్తుడు నాథన్, లిండ్సే, గ్రామ సర్పంచ్ నళిని ఆశాలత, పార్టీ నాయకులు కొమ్మూరి బాలకోటేశ్వరరావు, సయ్యద్ జానీ, పఠాన్ నాగుల్ మీరా, హెచ్‌ఎం నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌కు జెడ్పీ విద్యార్థిని ఎంపిక



సైన్స్ సెమినార్‌కు ఎంపికైన రుషిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని వై రుషిక జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.పద్మాలత శుక్రవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. చిరుధాన్యాలు, మంచి పోషకాహారమా లేక ఆహార వ్యామోహమా అనే అంశంపై పోటీ నిర్వహించగా రుషిక అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైంది. శనివారం జరిగే జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొంటుంది. ఈ సందర్భంగా గైడ్ ఉపాధ్యాయురాలు రమాదేవిని పలువురు అభినందించారు.